వరంగల్ కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దాస్యం వినయ్‌భాస్కర్

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- ఘనంగా జయంతి వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను ప్రారంభించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక సమానత్వం కోసం తన జీవితకాలం పోరాటం చేసిన సంస్కరణ శీలి జగ్జీవన్‌రామ్ అని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీసీవో సంజీవరావు, యువజన క్రీడల శాఖ అధికారి సత్యవాణి పాల్గొన్నారు. ఖానాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దళితరత్న కల్లేపల్లి ప్రణయదీప్ మాదిగ, ప్రొఫెసర్ గద్ద వెంకటేశ్వర్లు నర్సంపేట అంగడి సెంటర్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐనవోలులో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చింత అశోక్ ఆధ్వర్యంలో, పోచమ్మమైదాన్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని హనుమకొండ జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ జ్యోతిప్రజ్వలన చేసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధశుక్లా, డీఆర్‌వో గణేశ్, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మాజీ చీఫ్‌విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్లు లక్ష్మీ నారాయణ, యాదగిరి, నయూమొద్దీన్, బాబురావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, జనార్దన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు కనక రాజు, మనోజ్, నాయకులు పాల్గొన్నారు. హనుమకొండలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సీపీ అంబర్ కిశోర్ ఝా పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీపీలు అబ్దుల్ బారి, రవీందర్, జనగామ ఏఎస్పీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు. కేయూ సెనెట్‌హాల్‌లో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా 'కాంటెంపరరీ ఇష్యూస్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి బీ చంద్రకుమార్ పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. కేయూ వీసీ తాటికొండ రమేశ్, అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మి, పీఆర్‌వో పృథ్వీరాజు, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు దూరవిద్య ప్రాంగణంలోని బాబుజగ్జీవన్‌రామ్, బాబా సాహెబ్ అంబేద్కర్, పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో డిప్యూటీ కమిషనర్ రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతిలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ పాల్గొని మాట్లాడారు. టీపీఆర్‌వో రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, టీఎంసీ రమేశ్, సూపరింటెండెంట్లు బాకం సంతోష్, ఆనంద్, జేఏసీ అధ్యక్షుడు గౌరీ శంకర్, ప్రధాన కార్యదర్శి గోల్కొండ శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ ఘనంగా వేడుకలు..

కాజీపేట, ఫాతిమానగర్ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బాపూజీనగర్‌లో జాంబవ సంక్షేమ సంఘం సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఇమ్మడి రవి అధ్యక్షతన, సిద్దు టెంట్‌హౌస్ సమీపంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎల్కతుర్తి మండలకేంద్రంతోపాటు దండేపల్లిలో పలు సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశ్, వెంకటేశ్, సారయ్య, స్వామిరావు, సాంబయ్య, శ్రీను, రమేశ్, కట్కూరి శ్రీనివాస్, జన్ను సుధాకర్, బాబు, ఐలయ్య, దేవేందర్ పాల్గొన్నారు. ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మల్లయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంగెం ఎంపీడీవో కార్యాలయంలో, గవిచర్లలో జయంతి నిర్వహించారు. ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రమేశ్, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహచారి

కేయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల

హనుమకొండ చౌరస్తా ఏప్రిల్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ/హానర్స్/వొకేషనల్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 24.41 శాతం, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 30 శాతం, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 44.45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. వివరాలకు www.kakatiya.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నర్సింహచారి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పీ మల్లారెడ్డి, ఆచార్య వీ రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ సీహెచ్ రాధిక, క్యాంపు ఆఫీసర్లు డాక్టర్ ఆసీం ఇక్బాల్, నాయకపు సమ్మయ్య పాల్గొన్నారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

గీసుగొండ, ఏప్రిల్ 5 : ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు. గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన దబ్బేట స్పందన, గ్రేటర్‌లోని ధర్మారం గ్రామానికి చెందిన లింగాల కుమార్ వారం రోజుల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. కుమార్ తల్లిదండ్రులు కులాంతర వివాహాన్ని ఒప్పుకోకపోవడంతో కుమార్ మనుగొండలోని స్పందన ఇంట్లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం కుమార్, స్పందన ధర్మారంలోని ఇంటికి వచ్చారు. దీంతో కుమార్ తల్లిదండ్రులు స్పందనను కులం పేరుతో దూషిస్తూ కొట్టి, ఇంట్లో నుంచి గెంటివేశారు. దీంతో స్పందన ఫిర్యాదు మేరకు కుమార్, అతడి తల్లిదండ్రులతోపాటు స్నేహితుడిపై కేసు మోదు చేసినట్లు సీఐ తెలిపారు. మామునూర్ ఏసీపీ తిరుపతి శనివారం ధర్మారంలో విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోనే సమాజ పురోగతి: బన్న ఐలయ్య

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 5: విద్య సమాజంలో మార్పును తీసుకరావడమే కాకుండా సమాజ పురోగతికి దోహదపడుతుందని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య అన్నారు. విద్యఫౌండేషన్ పదో వార్షికోత్సవం, ప్రతిభా పురస్కారాల కార్యక్రమం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కవి, రచయిత, ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐలయ్య పాల్గొని మాట్లా డారు. అన్నిరకాల అసమానతలను తొలగించేది విద్యమా త్రమేనని అన్నారు. విద్య ఫౌండేషన్ బడుగు, బలహీన వర్గాలవారి చదువు కోసం నిరంతరం కృషిచేస్తున్నదుకు అభినందనలు తెలిపారు. జిల్లా మహిళా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధికారి మధురిమ, సీనియర్ సిటిజన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు, రచయిత్రి డాక్టర్ గురజాడ శోభ కూడా పాల్గొని మాట్లాడా రు. కాగా, ఇటీవల మహేందర్ సరిత దంపతుల పెళ్లి రోజు సందర్భంగా వారి శరీరదాన ధ్రువీకరణ పత్రాన్ని అతిథుల చేతుల మీదుగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అందజేశారు. అనంతరం గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది దివ్యాంగ, అనాథ విద్యార్థులకు విద్యా ఫౌండేషన్ ప్రతిభా పురస్కా రాలు-2023తోపాటు రూ. 1016 నగదు బహుమతి అందజేశారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న బన్న ఐలయ్య

అలాగే, అతిథి మనోవికాసం కేంద్రం డైరెక్టర్ సుజాత, మల్లికాంబ మనోవికాస కేంద్రం బాధ్యులు కల్యాణ్, రోటరీ క్లబ్ బాధ్యులు నరేశ్, వాసవీక్లబ్ బాధ్యులు అరవింద్, బ్లడ్ డొనేటర్ పల్లె రాజిరెడ్డికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు లయన్ పొట్లపల్లి శ్రీనివాసరావు, గురిజాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, డాక్టర్ అనితారెడ్డి, సినీ డైరెక్టర్ గట్టు నవీన్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకురాలు నున్న నరసమ్మ, లీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కాసుల రవికుమార్, సభ్యులు కొక్కుల కృష్ణ, రాపాక సోమన్న, బండారి సుజాత, చింతల కమల, కార్తీకరాజు, బూర రాజశేఖర్, సొన్నాయిల కృష్ణవేణి, సురేఖ, మద్దెర్ల అనిత, స్వరాజ్యం, ఉదయశ్రీ ప్రభాకర్, స్వర్ణలత, విజేందర్, మురళి, పీ సుధాకర్, మునిగాల దేవేందర్, కడుదుల సోమయ్య, అంజనీదేవి, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీలో క్రైస్తవులకు అన్యాయం'

మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్-సునీత

హనుమకొండ రస్తా ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి టికెట్ ఇవ్వడం లేదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్ ఇస్తుందని ఆ పార్టీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్, బొడ్డు సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. 20 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని టికెట్ ఆశించినా ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని జక్రియ ఫంక్షన్ హాల్‌లో పార్టీలకతీతంగా సమావేశాన్ని నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశించి రానివారు, కులసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జీపన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి స్వాధీనం

ఇద్దరు మహిళల అరెస్టు

ఖిలావరంగల్, ఏప్రిల్ 5 : చెన్నయ్ సెంట్రల్ నుంచి అహ్మదాబాద్‌కు వెళ్తున్న నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో వరంగల్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది మహబూబాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తనిఖీలు చేపట్టారు. జనరల్ బోగీలో మహారాష్ట్ర జల్గావ్‌కు చెందిన చందాబాయి భీమా (62), ఉషాదిలీప్ చౌహాన్ (43) ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించారు. వీరు కూర్చున్న సీట్ల కింద ప్లాస్టిక్ బ్యాగ్‌లు ఉండడంతో వీరిని వరంగల్ రైల్వే స్టేషలోని దింపి తనిఖీ చేశాం. రూ.50 లక్షల పైచిలుకు విలువైన 203 కిలోల ఎండు గంజాయి లభించింది. గంజాయిని విజయవాడ నుంచి జల్గావ్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు.

మద్యం పట్టివేత

వేలేరు, ఏప్రిల్ 5: మండలంలోని పీచర గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను వేలేరు ఎస్సై డీ హరిత పట్టుకుని సీజ్ చేశారు. గ్రామానికి చెందిన బొల్లి రాజు ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని సూమారు రూ.52,131 విలువ గల మద్యం సీసాలను సీజ్ చేసి, నిందితుడిని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

శాయంపేట, ఏప్రిల్ 5: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అత్యధిక కూలీల శాతాన్ని సాధించిన శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తోట రాజమల్లును డీఆర్‌డీవో నాగ పద్మజ, ఏపీపీ శ్రీనివాసరావు, ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. అలాగే, ఏపీవో,ఈసీ, మండల అధికారులు కూడా రాజమల్లును అభినందించారు.

బాలుడి అప్పగింత

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 5: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ బాలుడిని మట్టెవాడ పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వరంగల్ కొత్తవాడకు చెందిన అజయ్‌ని తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో బాలుడిని మండిబజార్‌లో ఎస్సై కుమార్, పెట్రోకార్ పీసీ కల్యాణ్‌కుమార్ గుర్తించారు. అతడి వివరాలు తెలుసుకుని శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారని సీఐ తమ్మ గోపి తెలిపారు.

చిట్‌ఫండ్ డైరెక్టర్ ఆత్మహత్యాయత్నం

ఇద్దరిపై కేసు నమోదు

పరకాల, ఏప్రిల్ 5: చిట్‌ఫండ్ లావాదేవీలు స్తంభించడంతోపాటు సహచరులు మోసం చేశారంటూ చిట్‌ఫండ్ యజమాని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పరకాలకు చెందిన దూమాల బాబురావు మరికొంత మందితో కలిసి ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్‌ను ప్రారంభించాడు. కొన్ని రోజులుగా చిట్‌ఫండ్ లావాదేవీలు స్తంభించడంతో కంపెనీ మూతపడింది. దీంతో చిట్టి ఎత్తుకున్న సభ్యులు డబ్బుల కోసం బాబురావుపై ఒత్తిడి చేశారు. లావాదేవీలు స్తంభించడం, సహచరులు మోసం చేశారనే మనోవేదనతో బాబురావు ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని దవాఖానకు తరలించారు. కాగా, ఈ ఘటనపై బాబురావు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పిల్లల నాగరాజుతోపాటు నాగర్ల వెంకటేశ్వర్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోపణలు నిరాధారం..

తనపై దూమాల బాబురావు చేసిన ఆరోపణలు నిరాధారణమైనవి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగర్ల వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బాపురావు 2018లో చిట్‌ఫండ్‌ను ప్రారంభించగా రెండేళ్లలోనే సంస్థ నుంచి సుమారు రూ. కోటిన్నర పక్కదారి మళ్లించి హైదరాబాద్‌లో ఆర్‌బిట్ ఫార్మా కంపెనీని ఏర్పాటు చేసి తన కుమారులకు అప్పగించాడని తెలిపారు. ఈ విషయాన్ని వ్యతిరేకించినందుకు తనను సంస్థ నుంచి వైదొలిగేలా ఒత్తిడి చేశాడన్నారు. తర్వాత మరో ఇద్దరు డైరెక్టర్లను కూడా సంస్థ నుంచి వెళ్లగొట్టి చిట్‌ఫండ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వ్యాపారంలో నష్టం రావడంతో తాను కొంత మందిని పిలిచి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మరికొంత మందికి చిట్ డబ్బులు ఇవ్వాలని వారు బాబురావు ఇంటి వద్దకు వెళ్లారని, ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

పాకాల అడవులకు పూర్వవైభవం తీసుకురావాలి

సీసీఎఫ్ భీమానాయక్

ఖానాపురం, ఏప్రిల్ 5: పాకాల అడవులకు పూర్వవైభవం తీసుకురావాలని భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్ అన్నారు. శుక్రవారం ఆయన వరంగల్ డీఎఫ్‌వో అంజూ అగర్వాల్‌తో కలిసి అశోక్‌నగర్ నర్సరీ, ప్లాంటేషన్, పాకాల ఎకో టూరిజం, అడవులను పరిశీలించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేసవిలో మంటలు అంటుకుని అడవులు దగ్ధం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణులకు తాగునీటి ఎద్దడి రాకుండా అడవుల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కలప స్మగర్లపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఒకప్పుడు పాకాల అడువుల్లో పులులు సంచరించేవన్నారు. మళ్లీ కొద్ది సంవత్సరాలుగా పులులు వస్తున్నాయని వాటికి ఎలాంటి ముప్పు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్, డీఆర్వోలు నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

అశోక్‌నగర్ నర్సరీని పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

'నిందితుడిని శిక్షించాలి'

కాజీపేట, ఏప్రిల్ 5: కేరళ రాష్ట్రంలో రైలులో టికెట్ అడిగినందుకు టీటీఈ వినోద్‌ను రైలులో నుంచి కిందికి తోసి, అతడి మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని రైల్వే సీటీఐలు విజయ్‌కుమార్, ఆర్ఆర్ ప్రసాద్, వీఆర్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్‌లోని కమర్షియల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం స్థానిక చెకింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో వినోద్ చిత్రపటానికి నివాళులర్పించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రైళ్లల్లో విధులు నిర్వర్తిస్తున్నటీటీఈలకు పోలీస్ ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టీటీఈలు రమేశ్ బాబు, హరిబాబు, నాగరాజు, మధు, శంకర్, యాదగిరి, వంశీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

గీసుగొండ, ఏప్రిల్ 5: గడ్డి మందు తాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. సీఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. కోనాయిమాకులకు చెందిన కాందారి సౌమ్య(20) బీఫార్మసీ చదువుతోంది. ఆరు నెలల నుంచి మైగ్రేన్‌తో బాధపడుతున్నది. ఈ నెల 2న తలనొప్పి భరించలేక ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. ఆమెను దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలి తండ్రి శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పరకాల, ఏప్రిల్ 5 : మరమ్మతుల సందర్భంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. పరకాల సబ్‌స్టేషన్ పరిధిలోని కామారెడ్డిపల్లి 11 కేవీ ఫీడర్‌లో అంతర్గత మరమ్మతులతోపాటు పలు లైన్లలో చెట్లను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కామారెడ్డిపల్లి, అలియాబాద్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

రేపు ప్రవేశ పరీక్ష

హనుమకొండ చౌరస్తా ఏప్రిల్ 5: హనుమకొండ జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో డాక్టర్ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి టీఎస్ఎంఎస్ పరీక్షా కేంద్రాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

వడదెబ్బ తో ఒకరి మృతి

భీమా(ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 5 : వడదెబ్బతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వేపచెట్టు తండాలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ భీమా(50) పొలం వద్ద పని చేస్తూ వడదెబ్బకు గురయ్యాడు. ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. అతడికి భార్య తార, కుమారుడు, కూతురు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సుబేదారి, ఏప్రిల్ 5: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి మహిళా ఏఎస్సై సువర్ణ తన సొంత ఖర్చులతో సుబేదారి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు సువర్ణను అభినందించారు.

నేడు నర్సంపేటలో నిరసన దీక్ష

నర్సంపేట, ఏప్రిల్ 5 : పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం రైతు దీక్షను చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న మిర్చి, ఇతర పంటలను నష్టపరిహారం కింద రూ.25,000 చెల్లించాలని కోరారు. వరి, మక్కజొన్నతో పాటు ఇతర పంటలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీతోపాటు కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ యంత్రీకరణ సబ్సిడీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు, ఏప్రిల్5 : ట్రీ కట్టింగ్, సబ్‌స్టేషన్ నిర్వహణ నేపథ్యంలో కొండపర్తి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెం గ్రామాల్లో బావుల దగ్గర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

ఓటుహక్కుపై అవగాహన పెంచాలి

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 5: ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని స్వీప్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వరంగల్ బస్టాండ్ రోడ్డులోని ఓ హోటల్‌లో దివ్యాంగులు, వృద్ధులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులతో ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవో విశ్వజ, డీఎస్‌డీవో సత్యవాణి, నోడల్ అధికారి రాజేశ్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేశ్, నవ తెలంగాణ వికలాంగుల ఫోరం అధ్యక్షుడు అజీమ్ పాల్గొన్నారు.

'కడియం కావ్యను ఓడిస్తాం'

గీసుగొండ, ఏప్రిల్ 5: పార్